ప్రజాశక్తి
ఆదివారం 14 డిసెంబర్ 2025
5
విజయనగరం

లోక్ అదాలత్‌లో 9513 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 9513 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత తెలిపారు. జిల్లా కోర్టుల్లో జరిగిన అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ ఈ అదాలత్ వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందని అన్నారు. పరిష్కారమైన కేసుల్లో సివిల్ కేసులు 424, క్రిమినల్ కేసులు 9028, ప్రీ లిటిగేషన్ కేసులు 61 ఉన్నాయన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీకి చెందిన 90 లక్షల రూపాయలు మోటార్ ప్రమాద బీమా కేసులో పిటిషనర్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా అందజేశారు. విజయనగరంలో 3612, పార్వతీపురంలో702, బొబ్బిలిలో 1197, సాలూరులో 1453, శృంగవరపుకోటలో 1001, గజపతినగరంలో 1052, చీపురుపల్లిలో 128, కొత్తవలసలో 236, కురుపాం 132, కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మీనాదేవి, అప్పలస్వామి, పద్మావతి, నాగమణి, ఎ.కృష్ణప్రసాద్, పలుశాఖల అధికారులు, ఇన్సూరెన్సు అధికారులు పాల్గొన్నారు.

జాతీయ ఉపాధి హామీకి లక్షల మంది పేదలను, వ్యవసాయ కార్మికులను దూరం చేసిన కేంద్ర ప్రభుత్వం ఏడాదికి అదనంగా 25రోజుల పని దినాలను పెంచుతున్నట్లు ప్రకటించడం, మరోవైపు ఉపాధి చట్టం పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్పు చేయడం ఉపాధి కూలీలను ఏమంత రుచించడం లేదు. వాస్తవానికి వీరు అడుగుతున్నది అదనంగా 100 పని దినాలు పెంచాలని. కనీసం రూ.600 వేతనం కల్పించాలని. పని ప్రదేశాల్లో నీరు, నీడ, గునపాలు, పారలు వంటివాటికి అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఐటీవల కాలంలో నిబంధనలు కఠినతరంతో కూలి కూడా సరిగా రావడం లేదు. 1,09,006 జాబ్‌కార్డులు హోల్డర్లో పెట్టేసి పట్టుమని పాతిక పనిదినాలు పెంచడంవల్ల ఉపయోగమేమిటని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఉపాధి చట్టం పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్పు
- గాంధీ పేరు మార్పు వెనుక ఆంతర్యమేమిటో?
- పనిదినాలు 200 రోజులకు పెంచాలంటున్న వ్యవసాయ కార్మిక సంఘం
- రోజువారీ వేతనం పెంచని మోదీ ప్రభుత్వం

లక్షల మందిని తొలగించి
25 పని దినాలు పెంపు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

2004లో అప్పటి యుపిఎ ప్రభుత్వం దేశంలో కమ్యూనిస్టుల భాగస్వామ్యంతో ఏర్పడిన సంగతి తెలిసిందే. వామపక్షాలతో కుదిరిన కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా ఆహార భద్రతా చట్టం, అటవీహక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం తదితరాలతో పాటు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఏర్పడింది. నేడు ఊరూరా వందరోజుల పనిదినాలు ప్రభుత్వం కల్పిస్తోందంటే అది అప్పట్లో వామపక్షాలు చూపిన చొరవే. ఇందులో భాగంగా ఏడాదిలో వందరోజులు పని దినాలు కల్పించడంతో పాటు రెండు వారాల్లోపే కూలి చెల్లించాలి. అడిగిన వెంటనే పని కల్పించలేకపోతే నష్టపరిహారం చెల్లించే బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఇంకా పని ప్రదేశాల్లో నీరు, నీడ, ఇతర భద్రతా చర్యలు, ఇన్సూరెన్స్ వంటి అనేక సదుపాయాలు సమకూర్చాలి. ప్రభుత్వాలు మారినప్పటల్లా ఈచట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు అవకాశం లేకుండా అప్పట్లో చట్టబద్ధం చేశారు. నాటి నుంచి యుపిఎ -2 ప్రభుత్వం ఉన్నంత వరకు బాగానే సాగినప్పటికీ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేస్తోంది. ఇందులో భాగంగానే జాబ్‌కార్డులకు ఆధార్, ముఖహాజరు, రెండు పూటలా పని వంటి విధానాలను తీసుకొచ్చింది. జిల్లాలో 6లక్షల 23వేల 471 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరందరికీ ఆధార్ అనుసంధానం చేయించాలని మెలిక పెట్టడంతో వివిధ కారణాలతో అయినవారికి లేని 1,09,006 మంది జాబ్ కార్డులను కొద్ది రోజుల క్రితమే హోల్డ్‌లో పెట్టేశారు. ఈ విధంగా జిల్లాలో అత్యధికంగా సంతకవిటి మండలంలో 6,915కార్డులు తొలగించారు. బొబ్బిలిలో 5,821, దత్తిరాజేరులో 5,759, రామభద్రపురంలో 5,655, తెర్లాంలో 5,520, వంగరలో 5,320, రేగిడి ఆమదాలవలసలో 5,267, మెరకముడిదాం మండలంలో 5,118 చొప్పున జాబ్‌కార్డులు తొలగించారు. ఇదేమంటే ఇది తొలగింపు కాదని, ఆధార్ అనుసంధానం కాకపోవడం వల్ల హోల్డ్‌లో మాత్రమే పెట్టామని చెబుతున్నప్పటికీ, వారు వివిధ వలస ప్రాంతాల నుంచి వచ్చి అడిగిన వెంటనే పని కల్పించే పరిస్థితి ఉండే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఇక నుంచి కేవలం 5,14 465 జాబ్‌కార్డుదారులకు మాత్రమే పనులు అందుబాటులో ఉంటాయి. మరోవైపు ఈ చట్టం పేరులో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అనే పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన (పథకం)గా మార్పు చేస్తూ శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్‌లో నిర్ణయం చేశారు. గాంధీ పేరు ఉచ్ఛరించడం ఇష్టం లేని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ విధంగా మార్పుచేసిందన్న విమర్శలు మేధావి వర్గం, రాజకీయ నాయకుల నుంచి వినిపిస్తున్నాయి. చిత్త శుద్ధి ఉంటే పనిదినాలు 25రోజులకు బదులు 100రోజులకు పెంచేలా డిమాండ్ చేయాలని కోరుతున్నారు.

పేరు మార్చడం జాతి పితను అవమానించడమే

దేశ స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని పక్కన పెట్టి బిజెపి ప్రతి విషయంలోనూ ఆర్‌ఎస్‌ఎస్ మూలాలను, మనువాద సిద్ధాంతాన్ని అనుసరిస్తుంది. అందులో భాగమే ఉపాధి చట్టం పేరు పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన (పథకం)గా మార్పు. వంద రోజులు పని దినాల లక్ష్యానికి ప్రతి ఏటా తూట్లు పొడుస్తున్నారు. రెండు పూటల పని, ఫేస్ యాప్ పెట్టడం, ఉపాధి హామీ నుంచి కూలీలను దూరం చేసేందుకు కుట్ర ఇది. పని దినాలను 200రోజులు పెంచాలని డిమాండ్ చేస్తుంటే 25రోజులు మాత్రమే పెంచడం దుర్మార్గం. కూలీల రోజువారీ వేతనం 600 కావాలని డిమాండ్ చేస్తుంటే రూ.300 లోపే వేతనం వచ్చేలా నిబంధనలు విధిస్తూ తాజాగా రూ.240కు సవరించడం వ్యవసాయ కార్మికులను బిజెపి ప్రభుత్వం మోసం చేయడమే.

జి.శ్రీనివాస్ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు

రూ.2500 కోట్లతో రహదారుల అభివృద్ధి

మార్చి ఆఖరుకు గుంతలు లేని రోడ్లు : ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

సాస్కి పథకం కింద రాష్ట్రంలో సుమారు 2,500 కోట్ల రూపాయలతో రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు తెలిపారు. ఆయన శనివారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. పలు రహదారులను పరిశీలించారు. విజయనగరంలో నిర్మాణంలో ఉన్న ఆర్ అండ్ బి అతిథి గృహాన్ని తనిఖీ చేశారు. దీనిపై పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డితో కలిసి జిల్లాలోని రహదారుల పరిస్థితిపై కలెక్టరేట్లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ సాస్కి పథకం కింద రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు రూ.500 కోట్లతో రహదారుల నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. వచ్చే ఏడాదినుంచి రూ.2వేల కోట్లతో రహదారుల నిర్మాణం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని రోడ్లను గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యమని, ఆదిశగా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్‌బి అధికారులను కోరారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమమని పేర్కొన్నారు. మార్చి నాటికి అన్ని రోడ్లను గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దాలని నిర్మాణ పనులను ముమ్మరం చేయాలని, వీలైనంత వేగంగా బిల్లులను చెల్లించేందుకు కృషి చేస్తామని కాంట్రాక్టర్లకు ఆయన హామీఇచ్చారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లను పదోన్నతితో గ్రేడ్ వన్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా తీసుకునేందుకు ప్రతిపాదన చేస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైల్వే పరంగా ఎదురవుతున్న సమస్యలను అధిగమించేం దుకు, ఆర్‌ఒబి, ఆర్‌యుబిల నిర్మాణాన్ని వేగంగా చేపట్టేందుకు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఆర్‌డిఒ, రైల్వే అధికారులతో కమిటీలను వేయాలని సూచించారు.

ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద కలెక్టర్‌తో మాట్లాడుతున్న కృష్ణబాబు

కలెక్టర్ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో రహదారుల అభివృద్ధికి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. వీటిపై 15 రోజులకు ఒకసారి సమీక్ష సమావేశాలను నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, ఆర్‌అండ్‌బి ఇఎన్‌సి వి.రామచంద్ర, ఎస్‌ఇ కాంతిమతి, ఆర్డీవో కీర్తి, ఆర్‌అండ్‌బి ఎఇలు, డిఇలు, ముఖ్య కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

గుర్లగెడ్డ ఆక్రమణలను అడ్డుకున్న ఆయకట్టు రైతులు

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని గుర్లగెడ్డ ప్రాజెక్టు ఎడమ కాలువను ఆనుకొని ఉన్న భూమి ఆక్రమణలను శనివారం ఆయకట్టు రైతులు అడ్డుకున్నారు. విజయనగరానికి చెందిన అప్పన్న రాజు జెసిబితో ఎడమ కాలువను కప్పివేసి వెంచరు వేసే పనులు చేపట్టగా రైతులంతా కలసి అడ్డుకున్నారు. పనులు చేపట్టనీయకుండా వాహనాలను నిలిపివేసి మీ భూమి ఎంత ఉందో రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు వచ్చి హద్దులు తేల్చేవరకు నిలిపివేయాలని గుర్ల గెడ్డ ప్రాజెక్టు పోరాట సమితి కార్యదర్శి రాకోటి రాములు హెచ్చరించారు. దీంతో పనులు చేపట్టిన వాహనాలను బయటకు రప్పించి పనులు నిలిపివేశారు. కార్యక్రమంలో వైసిపి మండల సీనియర్ నాయకులు రెడ్డి రాజప్పల నాయుడు, పుర్నాన అప్పలనాయుడు, బొద్దల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుడు

ఘనంగా పారా రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 4వ పారా రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు శనివారం స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌టి కమిషన్ మాజీ చైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ డివిజి శంకరరావు పోటీలు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ సంకల్పం ఉంటే సాధించ లేనిది ఏదీ ఉండదని వికలాంగ క్రీడాకారులు నిరూపిస్తున్నారని అన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో బాబా, కె.చందన (అనంతపురం), కోటేశ్వరరావు (విశాఖపట్నం), వడ్డీ సతీష్ కుమార్ సాహు, తాళ్లపూడి గౌతమి (విజయనగరం) రాష్ట్రస్థాయి విజేతలుగా నిలిచారు. వీరంతా జనవరి 16 నుండి 18 వరకు ఉత్తరఖండ్ లో జరుగబోయే నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్. వెంకటేశ్వర రావు, మాజీ రోటరీ గవర్నర్ డాక్టర్. ఎం.వెంకటేశ్వర రావు, రాష్ట్ర స్థాయి పోటీల కన్వీనర్ నాలుగెస్సులరాజు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి. రామస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్, విశాఖపట్నం గౌరవ అధ్యక్షులు డాక్టర్ షీతల్ మదాన్, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి గణేష్, సారథి వెల్ ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ప్రదీప్, ప్రతాప్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

తీరు మారకపోతే చర్యలు తప్పవు

జిల్లా పరిషత్తు చైర్మన్ శ్రీనివాసరావు
బ్లాక్ మార్కెట్లో ఎరువులు అమ్మకంపై ఆరా

ప్రజాశక్తి- మెరకముడిదాం

రెవెన్యూ అధికారులు తమ పనితీరు వారం రోజుల్లో మార్చుకోకపోతే తహశీల్దార్ కార్యాలయంలోనే గ్రీవెన్స్ పెట్టి రైతులు, ప్రజల నుండి వచ్చిన అపరిష్కృత ఫిర్యాదులను ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం ఎంపిపి తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చే క్రమంలో తహశీల్దార్ సులోచనరాణి వైస్ ఎంపిపి తలచుట్ల హరి లేవనెత్తిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానాలకు సభ్యులు సంతృప్తి చెందలేదు. దీంతో జెడ్‌పి చైర్మన్ కలుగుచేసుకుని మీ కార్యలయ సిబ్బంది పై మీరు నియంత్రణ కోల్పోయారని ఇలాగే కొనసాగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కనీసం కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయడానికి నెలల పడుతుందని సభ్యులు లేవనేత్తడంతో తహశీల్దార్ పై అసహనం వ్యక్తం చేశారు. యూరియా సరఫరాపై ఆరా తీస్తూ బ్లాక్ మార్కెట్‌లో 7 వందలకు అమ్ముతున్నారని సభ్యులు చెప్పడంతో నియంత్రించాలని ఆదేశించారు. ఎంపిపి కృష్ణవేణి మాట్లాడుతూ గర్భాం రెవెన్యూ పరిధిలో గల జంగాల మెట్ట వద్ద విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని అది గర్భాం సెక్షన్ పరిధిలోకి రావడం లేదని దత్తిరాజేరు ఎఇకి చెప్పి తక్షణమే తీగలను సరిచేసేలా చూడాలని చైర్మెన్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం హౌసింగ్ ఎఇ మురళి తమ శాఖ పని తీరు వివరిస్తుండగా మండలంలో అర్హత కలిగి ఇంటి మంజూరు కోసం దరఖాస్తు చేయనివారు ఉండకూడదు అని సూచించారు. శాఖలవారీగా సభ్యులకు పని తీరును వివరించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జి.భాస్కరరావు, తహశీల్దార్ ఆకుల సులోచనరాణి, మండల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వైస్ ఎంపిపి తలచుట్ల హరిబాబు, కందుల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిని ప్రశ్నిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెడికల్ కాలేజీలపై వైసిపి ప్రచారం నమ్మొద్దు : ఎంపి

ప్రజాశక్తి-విజయనగరంకోట

మెడికల్ కళాశాల విషయంలో వైసిపి నాయకులు చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం టిడిపి కార్యాలయం అశోక్ బంగారు లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఐటి హబ్ లో భాగంగా రాష్ట్ర అభివృద్ధితోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా రాష్ట్ర ఐటి శాఖమంత్రి నారా లోకేష్ విశాఖపట్నంలో కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించారన్నారు. ఉత్తరాంధ్రను ఎఐ, డేటా హబ్ గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. పొందూరు ఖాదీకి ప్రతిష్టాత్మమైన జిఐ ట్యాగ్ లభించడం ఒక వస్త్రానికి వచ్చిన గుర్తింపు మాత్రమే కాదని, శ్రీకాకుళం నేత కార్మికుల వారసత్వానికి లభించిన గౌరవమని అన్నారు, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాల్సింది పోయి విధ్వంసాలు, అరాచకాలు, ప్రలోభాలు సృష్టించడం వైసిపికి తగదని అన్నారు. జగన్ హుందాగా ప్రవర్తించి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు అధికారులు

గంజాయి రహిత రాష్ట్రమే ప్రధాన లక్ష్యం

ప్రజాశక్తి - చీపురుపల్లి

రాష్ట్రంలో గంజాయిని సంపూర్ణంగా రూపుమాపడమే ప్రధాన లక్ష్యంగా పోలీసుల అభ్యుదయ సైకిల్ ర్యాలీ విజయవంతంగా కొనసాగుతుందని సిఐ జి.శంకర్రావు అన్నారు. పాయకరావుపేట నుండి ఇచ్ఛాపురం వరకూ 25 మంది పోలీసుల ఆధ్వర్యంలో జరుగుతున్న అభ్యుదయ సైకిల్ ర్యాలీ శనివారం చీపురుపల్లి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక మూడు రోడ్ల కూడలిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల్లో, విద్యార్థుల్లో గంజాయి డ్రగ్స్ మాదక ద్రవ్యాలపైన అవగాహన కల్పించడమే ప్రధాన ఎజెండాగా ర్యాలీ కొనసాగుతుందన్నారు. గంజాయి మత్తులో జీవితాలను చిత్తు చేసుకోకూడదని పిలుపునిచ్చారు. గంజాయిని సేవించినా, అమ్మినా, రవాణా చేసినా, నిల్వ ఉంచినా, చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామన్నారు. అనంతరం గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరం ప్రతిజ్ఞ చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గరివిడి ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు, బుధ రాయవలస ఎస్‌ఐ లోకేశ్వరరావు, గుర్ల ఎస్‌ఐ నారాయణరావు, పలు కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

విజయనగరం టౌన్ : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వరకు జరుగు తాయని జయప్రదం చేయాలని ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ ముప్పల లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపట్టి వినియోగం దారులకు అవగాహన కల్పించాలని, జిల్లా స్థాయిలో జరిగే ఈ వారోత్సవాల ర్యాలీని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. 20 వరకు విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, నిర్వహిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాలకు, రైతు సంఘాల కు, వినియోగ దారుల సంఘాలకు వివిధ రకాల అవగాహన కార్యక్రమాలను చేపడతామన్నారు

పైథాన్ ప్రోగ్రామింగ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

జెఎన్‌టియులో ఎఐ హ్యాక్‌థాన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు జివి, జెన్ ఎఐ వర్సిటీ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు జరిగే 'జెన్ ఎఐ హ్యాక్‌థాన్ ఫర్ నెక్స్ట్ జనరేషన్ జాబ్స్' అనే ప్రతిష్టాత్మకమైన సాంకేతిక కార్యక్రమం శనివారం జెఎన్‌టియు-జివి లో ప్రారంభమైంది. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన డాక్టర్ సురేష్ బాత, సైంటిస్ట్ 'ఎఫ్' అండ్ ఒఐసి మాట్లాడుతూ విద్యార్థులకు బి.టెక్ పూర్తి అయిన తరువాత ఎన్నో సవాళ్ల ఎదురవుతాయని, జీవితంలో వాటిని సమర్థవంతంగా ఎదురుకోవడానికి ప్రస్తుత ప్రపంచంలో సాంకేతిక రంగంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా తమకున్న సాంకేతికత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కృత్రిమ మేధస్సును ఉపయోగించి సమాజానికి మేలు చేస్తు, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. మరో అతిథి జెన్ ఎఐ వర్సిటీ చీఫ్ అకడమిక్ ఆఫీసర్ నరేంద్ర అ మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో చక్కని నైపుణ్యం ఉన్న వారికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, మానవ మనుగడలో ఇది ప్రముఖ పాత్ర పోషిస్తోందని అన్నారు. అనంతరం నరేంద్ర అల్లం రచించిన 'పైథాన్ ప్రోగ్రామింగ్' అనే పుస్తకాన్ని జెఎన్‌టియు విశ్రాంత ఆచార్యులు జెవిఆర్ .మూర్తి చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ, కన్వీనర్ గా వ్యవహరించిన ప్రొఫెసర్. ఆర్. రాజేశ్వరరావు, సమన్వయ కర్తలుగా డాక్టర్. జిజె నాగరాజు, ఆర్‌డిడివి శివరామ్ ప్రొఫెసర్ కె.బాబు, జి.స్వామినాయుడు పాల్గొన్నారు.

ఉక్కు పేరిట తుక్కు చేయొద్దు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పరిశ్రమలు ఏర్పాటు చేస్తామంటే ఎవరు వద్దంటారు? అందులోనూ పారిశ్రామికంగా వెనుకబడిన విజయనగరం లాంటి జిల్లాలో ఏర్పాటుచేస్తే అడ్డుకునేదెవరు? కానీ, ఆ పేరుతో ఇప్పటికే ఉన్న జీవనోపాధిని దెబ్బతీస్తే ఊరుకుంటారా? ప్రస్తుతం మన జిల్లాలో ఇటువంటి వైఖరితో ముందుకు సాగుతోంది టిడిపి కూటమి ప్రభుత్వం. గుర్ల మండలంలోని కెల్ల, బెల్లానపేట, దమరసింగి, మన్యపురిపేట, ఎస్‌ఎస్‌ఆర్ పేట, వల్లాపురం పంట భూముల్లో సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్ ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు 1085 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. రైల్వే కనెక్టివిటీ, టౌన్ షిప్ పేరిట కూడా మరో 150 ఎకరాలు గుర్తించారు. గత నెలలో పత్రికల్లో వార్తలు వచ్చేవరకు తమకు ఈ సంగతి తెలియదని అంటున్నారు ఆయా గ్రామాలకు చెందిన ప్రజానీకం. ఇంత రహస్యంగా భూమి గుర్తింపు, నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనేది వారి ధర్మ సందేహం. తమ భూములు లాక్కోవడానికి కనీసం అభిప్రాయాలను కూడా తీసుకోవాల్సిన అవసరం లేదా? అని వారంతా ప్రశ్నిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే రకమైన చర్చనడుస్తోంది. కొంతమంది మన లాంటి వెనుకబడిన జిల్లాలో స్టీల్‌ప్లాంట్ వస్తే మంచిదే కదా అన్నవారు కూడా లేకపోలేదు. నిజమే స్టీల్‌ప్లాంట్ వస్తే మంచిదే. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కానీ, కొండ నాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడిపోతే సుఖం ఏముంటుంది. లాభం కన్నా నష్టమే ఎక్కువగా ఉంటుంది. అచ్చంగా అటువంటి పరిస్థితే కనిపిస్తోంది గుర్ల మండలంలో తలపెట్టిన స్టీల్‌ప్లాంట్ కూడా. ప్లాంట్ కోసం ప్రభుత్వం గుర్తించిన భూ మంతా పచ్చటి పంట పొలాలు . మొత్తం ఆరు గ్రామాల్లోని వేలాది కుటుంబాల జీవనంతో ముడిపడి ఉంది ఈ ప్రాంతం. ప్రభుత్వ భూమి కూడా 300 ఎకరాలకు మించి లేదు. ఇన్ని కుటుంబాల జీవనంతో ముడిపడివున్న ఈ భూమును తీసుకోవాలంటే ఎన్ని ఉద్యోగాలు ఇవ్వాలి. ఎంత ముందుచూపు ఉండాలి. ఆటువంటి ఆలోచన ప్రభుత్వం వద్ద లేదు. కేవలం 750 ఉద్యోగాల కల్పనకు ఉపయోగపడే కంపెనీకి దాదాపు 1200 ఎకరాలు కట్టబెట్టడమంటే ఎంత అన్యాయం. అంటే ఈ భూముల్లో వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వేలాది కుటుంబాలు 750కోసం పోటీ పడాలా? పోనీ, ఆయా ఉద్యోగాలేమైన స్థానికులకు ఇస్తారా? అటువంటి అవకాశమే లేదు. స్పాంజ్ ఐరెన్, పిగ్ ఐరెన్‌తోపాటు ఫెర్రో మిశ్రమం, బిల్లెట్లు, సింటర్ తదితర ఉత్పత్తులు తయారు చేసే ఈ ప్లాంట్‌లో ఖచ్చితంగా ఆయా రంగాల్లో నైపుణ్య ఉన్నవారికి మాత్రమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. సరిగ్గా నిర్వాసితులు, వారి తరపున పలుసంఘాలు కూడా ఇదే విషయాన్ని



ప్రస్తావిస్తు న్నాయి. నిజంగా ప్రభుత్వానికి పారిశ్రామికాభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ఖాళీగావున్న ప్రభుత్వ భూములు, లేదా వ్యవసాయ యోగ్యానికి పనికిరాని భూముల్లో ఇటువంటి పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. అవసరమైతే రోడ్లు, రైల్వే కనెక్టవిటీ ఏర్పాటు చేయాలి. అంతేగా, రైలు రోడ్డు పక్కన ఉన్న పాపానికి పంటలు పండే ప్రాంతాన్ని పారిశ్రామిక వేత్తలకు కట్టబెడతామంటే ఎలా? అని జనం ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇదే మాదిరిగా బ్రాకైట్ శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేస్తామంటూ ఎస్.కోట మండలంలో బొడ్డవర ప్రాంతంలో వ్యవసాయం, ఫలసాయం పండే సుమారు 1,166ఎకరాలను సుమారు 20ఏళ్ల క్రితం ప్రభుత్వం బలవంతంగా సేకరించి జింథాల్ సంస్థకు అప్పగించింది. అక్కడ ఇప్పటికీ ఆ కర్మాగారం ఏర్పాటు చేయలేదు. అందులో ఉద్యోగాలు, కంపెనీలో షేర్లు వంటి హామీలు నీటిమీద రాతలుగానే మిగిలాయి. వీటికోసం కూడా కనీస ప్రస్తావన కూడా చేయని ప్రభుత్వం జిందాల్ అనే ఆ ప్రైవేటు సంస్థకు కట్టబెడుతూ ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఆ భూమి విలువ అక్షరాల రూ.4604 కోట్లు ఉంటుందని అంచనా. నిర్వాసితులకు భూములూ లేవు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ లేవు. 1995లో అప్పటి టిడిపి ప్రభుత్వమే బొబ్బిలి గ్రోత్ సెంటర్ పేరిట 1,150 ఎకరాలు సేకరించింది. అక్కడ ఎన్ని పరిశ్రమలు ఉన్నాయో, ఉద్యోగాలెన్ని వచ్చాయో వేరేగా చెప్పనక్కర్లేదు. కొత్తవలసలో పంతంజలి ఫుడ్ ప్రొడక్ట్ పేరిట 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వమే 178 ఎకరాలు కట్టబెట్టింది. ఇప్పటికీ ఆ పార్కు అనవాళ్లు లేవు. బాడంగి మండలంలో మహవీర్ సంస్థకు, ఉమ్మడి విజయనగరం జిల్లా కొమరాడ మండలంలో ఆల్ఫా ఇన్‌ఫ్రా సంస్థలకు కట్టబెట్టిన భూముల్లోనూ ఎటువంటి పరిశ్రమలూ పెట్టలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, ఆయా భూముల్లోనైనా గుర్లలో తలపెట్టిన స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయవచ్చు అనే చర్చనడుస్తోంది. ఇదంతా కార్పొరేట్ శక్తులకు భూములు కట్టబెట్టడం కోసమేనన్న అనుమానాలు కూడా వ్యక్తమౌతున్నాయి. ఇందుకు తగ్గట్టే తస్మత్ జాగ్రత్త అన్నట్టుగా నిర్వాసితులు ప్రభుత్వం తీరుపై తీవ్ర వ్యతిరేకత ప్రదర్శిస్తున్నారు. ఆందోళనలు చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యాన గతసోమవారం కలెక్టరేట్ వద్ద వేలాది మంది ఆందోళన చేపట్టారు. 'మా ఊరు... మా భూమి... మా హక్కు..' అంటూ పెద్దపెట్టున చేసిన నినాదాలతో కలెక్టరేట్ ప్రాంతం దద్దరిల్లింది. రైతులు, వ్యవసాయ కార్మికులతోపాటు యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుతో తమ జీవితాలతో ఆటలాడ ఎకోవద్దని,బతుకులను తుక్కుచేయొద్దంటూ నినదించారు.

స్క్రబ్ టైఫస్ పై అవగాహన

కొత్తవలస: ఫియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని నిమ్మలపాలెంలో విఐఎ కుమారి ఆధ్వర్యంలో స్క్రబ్ టైఫస్ జ్వరాలపై అవగాహన కల్పించినట్లు హెల్త్ అసిస్టెంట్ సత్యారావు తెలిపారు. స్క్రబ్ టైఫస్ మైట్స్ (చిగ్గర్) అనే చిన్న పురుగులు కరిచినపుడు వచ్చే జ్వర వ్యాధి అని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్క్రబ్ టైఫస్ వల్ల అధిక జ్వరం, శరీరంపై నల్లటి మచ్చ ఏర్పడటం, తలనొప్పి, అలసట, ఒళ్ళు నొప్పులు, కళ్ళు ఎర్రబడటం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాంతులు, వంటి లక్షణాలు కనబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పి పావని, అంగన్వాడీ వర్కర్ అప్పయమ్మ, ఆశ వర్కర్ ఈశ్వరమ్మ, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి: మున్సిపల్ ఉద్యోగులపై చేస్తున్న తప్పుడు ప్రచారాలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉద్యోగులపై నిరాధారమైన అవినీతి ఆరోపణలు చేస్తున్న వారిపై పరువునష్టం కేసు వేసి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్ బాబుకు మున్సిపల్ ఉద్యోగులు శనివారం వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ ఉద్యోగులపై నిరాధారమైన ఆరోపణలు చేయడంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎటువంటి అనుమానాలు ఉంటే మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించి నిర్ధారణ చేసుకోవాలని కోరారు.

సబ్సిడీతో పశువులు దానా పంపిణీ

దత్తిరాజేరు: పాడి రైతులకు 50 శాతం సబ్సిడీ ద్వారా సమీకృత పశు దాణా బస్తాలను పెదమానాపురం పశువైద్యాధికారి అవినాష్ ఆధ్వర్యంలో శనివారం టిడిపి నాయకులు సమక్షంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 220 పశుదాణా బస్తాలు వచ్చాయని ఇందులో పెదమానాపురం పశు వైద్య కేంద్రానికి 127 బస్తాలు, దత్తి రాజేరు పశు వైద్య కేంద్రానికి 90 బస్తాలు వచ్చాయని అన్నారు. బస్తా ఖరీదు రూ.1100 కాగా ప్రభుత్వం 50శాతం సబ్సిడీ ఇవ్వడంతో పాడి రైతులు రూ.550 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గేదెల రామసత్యం, గంటా తులసి నాయుడు పాల్గొన్నారు.

వైసిపి నాయకునికి మాతృవియోగం

డెంకాడ: మండలంలోని పెద్దతాడివాడ పంచాయతీ పరిధిలో గుండాలపేట గ్రామానికి చెందిన వైసిపి జిల్లా కార్యదర్శి సభ్యుడు బుగత రమణ తల్లి బుగత సన్యాసమ్మ (90) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమె గత కొంత కాలంగా బాధపడుతూ ఇంటి వద్దనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె పార్థివ దేహాన్ని వైసిపి మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు, ఉపాధ్యక్షులు బమ్మిడి వెంకటరావు, వైసిపి అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షులు పతివాడ కృష్ణవేణి, కార్యదర్శి సభ్యుడు రమణ, ఎంపిటిసి గారిపల్లి రమేష్, పినతాడివాడ సర్పంచ్ లంక లక్ష్మణరావు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు సందర్శించి నివాళులర్పించారు.

190 మందికి పరీక్షా కిట్లు పంపిణీ

జామి: ఇటీవల వరద పోటులు పాటు మండలంలో పర్యటించిన విద్యామృతం సాయి భీమసింగి ప్రభుత్వ పాఠశాలకు చెందిన 190 మంది విద్యార్థులకు శనివారం పరీక్షా కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి నన్నయ్య విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ బి. ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులకు కిట్లు అందజేశారు. సేవా సాయి మార్గమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె రవికుమార్, పాండ్రంగి సంజీవు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి సేవ చేయాలి

గుర్ల: ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధికి కొంతైనా సేవ చేయాలని జిల్లా ఎస్‌పి ఎఆర్ దామోదర్ అన్నారు. శుక్రవారం రాత్రి గుర్ల పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన ఎన్ఎస్ఎ కామేశ్వరరావు చేసిన సేవలను అభినందిస్తూ ఆతనకు రివార్డ్ ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు తయారు చేయించిన గాన్ని సంచులు ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, ప్రకృతిని కాపాడండి, ప్లాస్టిక్ వద్దు పర్యావరణం ముద్దు, అన్న నినాదాలతో గ్రామాలలో విస్తృత ప్రచారం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి డిఎస్‌పి ఎస్ రాఘవులు, చీపురుపల్లి సిఐ జి.శంకర్రావు, గుర్ల ఎస్ఐ పి.నారాయణరావు, బుధరాయవలస ఎస్ఐ లోకేష్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

శృంగవరపుకోట: వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వటంలో తీవ్ర జాప్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని జన జాగృతి సంస్థ ఉత్తరాంధ్ర కన్వీనర్ సిరాపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక దేవి గుడి కూడలి వద్ద విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 3,733 మంది వృద్ధులకు వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వవలసి ఉందని దీనికి సంబంధించి విజయనగరం డిఆర్‌డిఎ పీడీ సంబంధిత వృద్ధుల జాబితా, కవరింగ్ లెటర్ సూపరింటెండెంట్‌కు పంపారని శ్రీనివాసరావు చెప్పారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ నిర్లక్ష్యం వల్ల వృద్ధులు ఇబ్బంది పడుతున్నారని సంవత్సరాలుగా జాప్యం చేస్తున్న అధికారులను గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉన్నత శిఖరాలకు చేరాలి

చీపురుపల్లి: ప్రతి విద్యార్థి మానవ జీవితంలో ఆధ్యాత్మికతకు ప్రాధాన్యత నివ్వాలని చీపురుపల్లి ఓంశాంతికి చెందిన బికే శాంతి అక్కయ్య పిలుపునిచ్చారు. మండలంలోని రావివలస గ్రామంలో సత్యరామ డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. వాలంటీర్లకు మానవ జీవితం - మెడిటేషన్ ప్రాధాన్యత అనే అంశం పై దృష్టి సారించాలన్నారు. అనంతరం వాలంటీర్స్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల పరిసరాలలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ ముకుందరావు, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ ఎం.లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు : ఎమ్మెల్యే

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి గ్రామంలో గల శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయానికి ధూప దీప నైవేద్యం పథకంలో భాగంగా నెలకు రూ.10వేలు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శనివారం తెలిపారు. తక్కువ ఆదాయంతో నడుస్తున్న ఆలయాల్లో ప్రతిరోజు ధూప దీప నైవేద్య కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగించాలని అక్కడ సేవలు నిర్వహిస్తున్న అర్చకులకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ నగదు ఆలయ అర్చకుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు.

అవినీతి, అక్రమాలపై విచారణ జరపండి

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీలో పనులు చేయకుండా బిల్లులు పెట్టి జనరల్ ఫండ్‌ను దోచేస్తున్న అంశంపైన, ఇందిరమ్మ కాలనీలో బినామీ పట్టాలకు ఇంటి పన్ను కట్టే వ్యవహారంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న డిమాండ్ చేశారు. బొబ్బిలి మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని కోరుతూ బొబ్బిలి పాత బస్టాండ్ ఆవరణంలో ఉన్న మున్సిపాలిటీ మొట్టమొదటి చైర్మన్ క్రీస్తు శేషులు ఆరి గంగయ్య విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు గొల్లపల్లి తవుడు, పాలూరి కృష్ణ పాల్గొన్నారు.

స్పందించిన ఆర్‌టిసి రీజనల్ చైర్మన్



దొన్నుదొరకు వినతినిస్తున్న అప్పారావు

వేపాడ: విశాఖపట్నం నుంచి వేపాడకు నైట్ హాల్ట్ బస్సును వేయాలని మండలంలోని సింగరాయి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ దన్నుదొరను శనివారం కోరారు. దీనికి స్పందించిన ఆయన వెంటనే స్టేట్ ఆర్‌టిసి కార్పొరేషన్ ఎమ్‌డికి ఫోన్ చేయగా ఈ నెల 18 తేదీలోగా బస్సు సౌకర్యం కల్పించాలని తమకు ఇప్పటికే సమాచారం వచ్చిందని వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. వెంటనే విశాఖపట్నం ఆర్‌టిసి రీజినల్ మేనేజర్‌తో దొన్నుదొర మాట్లాడి నైట్ బస్సు వేయాలని చెప్పగా ఆయన కూడా సానుకూలంగా స్పందిస్తూ తప్పనిసరిగా బస్సు సౌకర్యం కల్పిస్తామని చైర్మన్‌కు చరవాణిలో తెలిపారు. దీంతో రిక్కి అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. తాను ఇదే అంశంపై ఈ నెల 8న సిఎం, డిప్యూటీ సిఎం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశానని దీంతో అందరూ స్పందించి బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారని తెలిపారు.

సమావేశాలే.. పరిష్కారం శూన్యం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల సర్వ సభ్య సమావేశాలు జరగడం సభ్యులు సమస్యలు లేవనెత్తడం తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదు. గత సమావేశాల్లో చర్చించిన అంశాలపై అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గాని దృష్టి సారించకపోవడంతో సమస్యలు పూర్తిగా పరిష్కారం కాక మరల పాత సమస్యలే ఉత్పన్నమవుతున్నాయి. గిరిజనులకు డోలి సమస్యలు లేకుండా చేస్తామని మండలంలోని గిరిశిఖర గ్రామ పంచాయతీ అయిన దారపర్తి పరిధిలో గల పల్లపు దుంగాడ, మూల బొడ్డవర పంచాయతీ పరిధిలో చిట్టెంపాడు, బొడ్డపాడు, లక్ష్మీపురం, గాదిలోవ గ్రామాలకు రహదారి నిర్మాణం కోసం కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని శంకుస్థాపనలు చేసి కొబ్బరికాయలు కొడుతున్నారు తప్ప ఏ ప్రభుత్వం ఉన్నా పనులను పూర్తిస్థాయిలో చేపట్టడం లేదు. ఇటీవల వర్షాలకు గాదిలోవ గ్రామ పిల్లలు బడికి వెళ్లాలంటే వాగు దాటాల్సిందే అని ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి స్పందించిన అప్పటి జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు మండల అధికారులు పరిశీలించి వచ్చారే తప్ప పరిష్కార మార్గం చూపలేదు. ప్రజాశక్తి వార్త చదివిన ఓ యూట్యూబర్ ముందుకు వచ్చి వారికి తాత్కాలిక వంతెనను ఏర్పాటు చేశాడు. మూల బొడ్డవర పంచాయతీని విభజించి గిరిజన పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి గిరిజనులు పోరాడుతున్నా సమస్యను పట్టించుకున్న వారే కరువయ్యారు. మండల పరిధిలో ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డలు, ఆక్రమణలు జరుగుతున్నాయని, ప్రతి సమావేశంలోనూ రెవెన్యూ సమస్యలపై ప్రజా ప్రతినిధులు వాదనలు వినిపిస్తున్నారే తప్ప అధికారులు పరిష్కార మార్గాలు చూపడం లేదు. ఇరిగేషన్ శాఖ అధికారులైతే సమావేశాలకు హాజరైన దాఖలాలే లేవు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పట్టణంలో పనులు నిమిత్తం వచ్చిన వారికి సేదదీరేందుకు ఉన్న ఒక్కగానొక్క మహాత్మా గాంధీ పార్క్ పునర్నిర్మాణం నిమిత్తం లక్షల్లో డొనేషన్లు వసూలు చేశారు. ప్రభుత్వ నిధులు కూడా మంజూరు చేసినప్పటికీ పనులు నేటికీ ప్రారంభం కాకపోవడంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైంది. మండలంలోని ధర్మవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ గాలి సన్యాసయ్య, చామలాపల్లి సర్పంచ్ సూర్యారావు, మూల బొడ్డవర సర్పంచ్ దేవాపురపు మీనా మరికొందరు సర్పంచులు తమ గ్రామాలలో సమస్యలు పై తరచూ సమావేశాల్లో ప్రస్తావిస్తునా పరిష్కారం కావడం లేదని మరలా అవే సమస్యలను లేవనెత్తుతున్నారు. నేడు మరోసారి ఎంపిపి సండి సోమేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శనివారం తెలిపారు. దీంతో ఈ సమస్యలు మరోసారి తెరపైకి వస్తాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నైపుణ్య విద్యలో అగ్రగామి సెంచూరియన్ వర్సిటీ

◆డాక్టర్ ఎస్.ఎన్.సాబత్, శంకరన్ నరేన్ ◆ఘనంగా సెంచూరియన్ స్నాతకోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణనివ్వడంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం (సియుటిఎం) ఒక ప్రత్యేకతను సంతరించుకొని అగ్రగామిగా నిలిచిందని ఉత్తరప్రదేశ్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు చైర్మన్ డాక్టర్ ఎస్.ఎన్.సాబత్ అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవ వేడుకలకు ఆయన విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఎన్.సాబత్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య, ఆచరణాత్మక జ్ఞానం, అభ్యాస ఆధారిత విద్యకు సెంచూరియన్ నిదర్శనమన్నారు. యువత నిజాయితీ, నైతిక విలువలతో ముందడుగు వేయాలన్నారు. మరో విశిష్ట అతిథి ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఎఎంసి సిఐఒ శంకరన్ నరేన్ మాట్లాడుతూ రాబోయే కాలంలో కృత్రిమ మేధస్సు, జన్యు చికిత్స, బయో టెక్నాలజీ వంటి ఆవిష్కరణలతో కొత్త కొత్త మార్పులు రాబోతున్నాయన్నారు. ఎవరైతే సాంకేతిక మార్పుతో వేగం పెంచుకోలేకపోయారో వారు వెనుకబడినట్టు చరిత్ర ద్వారా నిరూపితమవుతుందన్నారు. అందువల్లనే యువత మార్పును స్వాగతించాలన్నారు. ఈ వేడుకలకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సెంచూరియన్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ అనేది నైపుణ్య సమీకృత ఉన్నత విద్యా కేంద్రమని కొనియాడారు. విద్యార్థులు తమ జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ప్రతి ఒకరు ఉన్నతంగా ఎదగడానికి కావాల్సిన లక్షణాల గురించి వివరించారు.అనంతరం ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజు, విశిష్ట అతిథులు డాక్టర్ ఎస్.ఎన్. సాబత్, శంకర్ నరేన్, ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా, ప్రొఫెసర్ డి.ఎన్.రావు అతిథుల చేతుల మీదుగా ఆరు పిహెచ్‌డిలతోపాటు 409 మందికి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. అతిథులుగా విచ్చేసిన సాబత్, శంకరన్ నరేన్‌లకు గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. వివిధ విభాగాలలో టాపర్లకు 14 బంగారు పతకాలను, 8 మందికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ విద్య నాణ్యత, పరిశోధనలను పెంపొందించేందుకు సెంచూరియన్ తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయ అధ్యక్షులు ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా, సెంచూరియన్ విశ్వవిద్యాలయం భువనేశ్వర్ క్యాంపస్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సుప్రియా పట్టనాయక్, విజయనగరం రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ప్రొఫెసర్ డి.ఎన్.రావు సతీమణి పద్మ, గవర్నింగ్ బోర్డు సభ్యులు, విద్యామండలి విశిష్ట సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పట్టా ప్రదానం చేస్తున్న అతిథులు

లోక్ అదాలత్‌లో 1198 కేసులు రాజీ

ప్రజాశక్తి -బొబ్బిలి

స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1198 కేసులను రాజీ చేశారు. సీనియర్ సివిల్ జడ్జి బిహెచ్‌వి లక్ష్మికుమార్, జూనియర్ సివిల్ జడ్జి హేమస్రవంతి జానకిరామ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణిరావు ఆధ్వర్యంలో మూడు బెంచులను ఏర్పాటు చేసి లోక్ అదాలత్ నిర్వహించారు. సత్వర న్యాయం కోసమే లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జడ్జిలు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి ప్రిసైడింగ్ అధికారిగా జాతీయ లోక్ అదాలత్‌ను స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తంగా 450 కేసులను రాజీ పరిష్కారం చేసినట్లు కోర్టు సిబ్బంది కె. శ్రీనివాసరావు తెలిపారు. సెకండ్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి జి.అప్పలనాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

త్రోబాల్ ఆడుతున్న ఉపాధ్యాయినిలు

జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రీడా పోటీలు శనివారం స్థానిక విజ్జీ మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ప్రారంభించారు. నిరం తరం వృత్తిలో ఉండి మానసిక ఉల్లాసం కోసం, ఆరోగ్యం కోసం క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పేందుకు విద్యా శాఖ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహి ంచడం అభినందనీయమని అన్నారు. పురుషులకు క్రికెట్ పోటీలు, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ పోటీలకు విజయనగరం డివిజన్ నుంచి 11మండలాల నుంచి 11 జట్లు, జట్టుకు 11మంది చొప్పున 121మంది ఉపాధ్యాయులు, త్రో బాల్ కు జట్టుకు 12మంది చొప్పున 132మంది మహిళా ఉపా ధ్యాయులు హాజరయ్యారు. రెండు రోజులు పాటు జరగనున్న ఈ క్రీడా పోటీల్లో ఉపాధ్యాయులకు బోజన వసతి సౌకర్యం కూడా విద్యా శాఖ కల్పించింది. డివిజన్ స్థాయి పోటీలో విజేతలుగా నిలి చిన జట్లు ఈ నెల 22తేదీన జరగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

కేంద్రీయ విద్యాలయంలో క్రీడోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిఎం కేంద్రీయ విద్యాలయంలో వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా వెంకటరమణ డిప్యూటీ డిఇఒ సన్యాసి రాజు హాజరయ్యారు. భారత్ స్కౌట్స్‌అండ్ గైడ్స్ విద్యార్థులు సాధారంగా ఆహ్వానించారు. అశోక, శివాజీ, ఠాగూర్, రామన్వేరు మీదున్న నాలుగు హౌసెస్ కింద మొత్తం విద్యార్థులంతా విభజించబడి, పోటీపడి మొత్తం 600 బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రావీణ్యత కనపరచిన విద్యార్థులను సత్కరించారు, విజేతలకు మెడల్స్ , సర్టిఫికెట్‌లు అందజేసినట్లు ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ తెలిపారు.

అండర్ -14 క్రికెట్ మ్యాచ్ ప్రారంభం

విజయనగరం టౌన్ : స్థానిక విజ్జీ స్టేడియంలో సింగపూర్ క్లబ్, విజయనగరం టీమ్‌ల మధ్య జరిగే అండర్ -14 క్రికెట్ మ్యాచ్‌ను విజయనగరం క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఇతర దేశాల పిల్లలతో, మన ప్రాంతీయ పిల్లలను ఆడించడం ద్వారా వారిలో నైపుణ్యం పెరిగి దేశీయ, అంతర్జాతీయ క్రికెట్ లో ఆడేందుకు తోడ్పడుతుందని అన్నారు. విజయనగరం క్రికెట్ అసోసియేషన్ ఆ దిశగా కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రాంబాబు, సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

ప్రజాశక్తి- రామభద్రపురం

స్థానిక మేజరు పంచాయతీలో పారిశుధ్య కార్మికులు శనివారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. గత 20 రోజులుగా సమ్మె చేస్తున్నా తమ సమస్యలను ఏ ఒక్కరూ పట్టించుకో కపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బకాయి ఉన్న నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతున్నా పంచాయతీ అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా తమ జీతాలు పెంచమనడం నేరమా అని ప్రశ్నించారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి గ్రామంలో చెత్తాచెదారాన్ని తొలగించి ప్రజల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న తమపై ఇంత కక్ష చూపడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. వీరికి మద్దతు ఇస్తున్న సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు పెండింగ్ జీతాలు చెల్లించి వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు కారంగి జ్యోతి, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి గ్రామంలో ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు తన ఇంటివద్ద శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులలో భూ సమస్యలు, సిసి రోడ్లు, కాలువలు, ఎలక్ట్రికల్ వంటి తగు సమస్యలు పరిష్కరించాలని విన్నవించుకున్నారు. రీసర్వేలో అనేక పొరపాట్లు జరిగాయని వాటిని అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి ఆ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కొత్తవలస

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈనెల 15వ తేదీన విజయనగరం సిఎంఆర్ జంక్షన్ దగ్గర ఉన్న వైయస్సార్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం మీదగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామని ఈ కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ర్యాలీ అనంతరం ఈ నెల 18న గవర్నర్‌కి ఈ సంతకాల పత్రాలు అందజేసే కార్యక్రమం చేపడతామన్నారు. నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల నుంచి ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మండల పార్టీ అధ్యక్షులు సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గొరపల్లి శివ, మండల అధ్యక్షులు జామి రవి కుమార్, వేపాడ మండల అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం, ఎల్.కోట గుమ్మడి సత్యన్నారాయణ, జెసిఎస్ ఇంచార్జ్ బొంతల వెంకటరావు, పెనుగంటి చల్లయ్య పాల్గొన్నారు.

ప్రజా వైద్యం ప్రజల హక్కుపై పోరాటం

చీపురుపల్లి: ప్రజా వైద్యం ప్రజల హక్కు పై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని జిల్లా వైసిపి ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న జిల్లా కేంద్రంలో జరగనున్న వైసిపి నిరసన కార్యక్రమానికి ప్రజలు భారీ ఎత్తున హాజరుకావాలని కోరారు. కోటిసంతకాల కార్యక్రమం ద్వారా గవర్నర్‌కి నివేదికను సమర్పించి ప్రజల తరపున న్యాయం కోరుతామన్నారు.

సిటీ స్కాన్ సెంటర్ ప్రారంభం

శృంగవరపుకోట: పట్టణంలోని సంజీవని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద గాయత్రి డయాగ్నోస్టిక్స్ సిటీస్కాన్ సెంటర్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజలతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. అత్యున్నత సాంకేతికత, అధునాతన పరికరాలతో కూడిన సంజీవని ఆస్పత్రి వైద్యసేవల్లో అందరి మన్ననలు అందుకోవాలని కోరారు. వైజాగ్ వెళ్లే అవసరం లేకుండా గ్రామీణ ప్రాంత ప్రజల కోసం సీటీ స్కాన్ ఏర్పాటు చేయడం శుభపరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల రామకృష్ణ, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్లు నానిగిరి రమణాజీ, గనివాడ బంగారు నాయుడు, ప్రధాన కార్యదర్శి కొట్యాడ జగదీశ్, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్, నియోజకవర్గ అధ్యక్షులు అనకాపల్లి చెల్లయ్య, వాకాడ బాలు, పెదగాడ రాజు, మల్లేశ్వర రావు, యూనిట్ ఇంచార్జ్ వసంత వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ముడసర్లపేటలో వృద్ధురాలు హత్య

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని ముడసర్లపేటలో శనివారం దారుణ ఘటన చోటుచేసుకుంది. కాలనీలో నివసిస్తున్న ముడసర్ల అప్పయ్యమ్మ (70)ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అప్పయ్యమ్మ వద్ద ఉన్న సుమారు రెండు తులాల బంగారాన్ని దొంగతనం చేసిన అనంతరం ఆమెను హతమార్చి ఉంటారని, అనంతరం ఇంటికి సుమారు 150 మీటర్ల దూరంలో మృతదేహాన్ని పడేసి నిందితులు పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అప్పయ్యమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సూర్యప్పన్న (48), చిన్న కుమారుడు అప్పన్న (45). అయితే గత రెండు రోజుల క్రితం అప్పన్న తన భార్యా పిల్లలతో కలిసి విజయవాడ అమ్మవారి దర్శనానికి వెళ్లాడని, అప్పయ్యమ్మ పెద్ద కుమారుడు అదే కాలనీలో నివాసం ఉంటున్నప్పటికి పది రోజుల క్రితం బతుకు తెరువు కోసం వేరే ప్రాంతానికి కొబ్బరి బొండాలు తీసే పనిమీద వెళ్లి అక్కడే ఉంటున్నాడని స్థానికులు తెలిపారు. శనివారం ఉదయం చూసేసరికి ఆమె ఇంట్లో కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతకగా కాలనీకి కొంచెం దూరంలో మృతదేహం ఉండడాన్ని గమనించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ పాపారావులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని డిఎస్‌పి ఆర్.గోవిందరావు పరిశీలించారు. ఘటనపై కాలనీలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. నిందితులను త్వరితగతిన పట్టుకొని కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

కారు, బైకు ఢీకొని యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కారు, బైకు ఢీకొన్న ఘటనలో పట్టణంలోని పుణ్యగిరి కాలనీకి చెందిన షేక్ ఇరాన్ (19) మృతి చెందాడని అనంతగిరి పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ, బి.రాజనాయుడు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్ మదీన, షేక్ నూర్జహాన్ దంపతులకు ఇద్దరు కుమారులు. తండ్రి మదీన పట్టణంలో మాంసం దుకాణం నిర్వహిస్తుండగా పెద్ద కుమారుడు ఇరాన్ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరిలో మాంసం దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇరాన్ అనంతగిరి మండలం యాతమానువలసకు చెందిన తన స్నేహితుడు మోజేష్ కుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కాశీ పట్టణం నుంచి అనంతగిరి వైపు వెళుతుండగా కాశీపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ మలుపు వద్ద అరకు నుండి ఎస్‌కోట వైపు వస్తున్న ఇన్నోవా కారు అత్యంత వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కింద పడిపోయారు. ఇరాన్‌కు మర్మాంగాల వద్ద బలమైన గాయం అవ్వగా మోజేష్ కుమార్ తలకు గాయం అవడంతో పాటు షోల్డర్ బోను విరిగింది. వీరిని పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఇరాన్ మరణించాడని మోజేష్ కుమార్‌ను విశాఖ కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారని అతని పరిస్థితి కూడా విషమంగా ఉందని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అనంతగిరి ఏఎస్ఐ రాజం నాయుడు తెలిపారు.

గాయపడ్డ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లి జివిఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.ఆకాష్ (17) అనే విద్యార్థి విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 8న కళాశాలలోని తరగతులు ముగించుకుని జివిఆర్ కళాశాల వద్ద ట్రాక్టర్ లిఫ్ట్ అడిగి నలుగురు స్నేహితులతో పాటు ఆకాష్ కూడా ట్రాక్టర్ ఎక్కాడు. స్థానిక భారత్ పెట్రోల్ బంక్ వద్దకు చేరుకునేసరికి ఆకాష్ ట్రాక్టర్ నుండి ప్రమాదవశాత్తు జారి ఇంజన్‌కు తొట్టుకు మధ్య పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చీపురుపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విజయనగరం తరలించి అక్కడి నుండి విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందడంతో స్వగ్రామమైన జామి మండలానికి మృతదేహాన్ని తరలించారు. ఆకాష్ తండ్రి బంగారుబాబు వెల్డింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. చీపురుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్నారుల సంక్షేమాన్ని చూసుకుంటాం

ప్రజాశక్తి - జామి

అనాధులుగా మిగిలిన గౌతమ్, విజయ్‌ల సంక్షేమాన్ని సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ (స్పెక్ట్) తరపున చూసుకుంటామని సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి హామీ ఇచ్చినట్లు ఆ సంస్థ సభ్యుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి షిణగం శివాజీ తెలిపారు. మండలంలో జన్నివలస గ్రామానికి చెందిన గౌతమ్, విజయ్‌లు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన విషయాన్ని తెలుసుకుని డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి స్పెక్ట్ సంస్థ తరపున ఆ చిన్నారులు ఒక్కొక్కరికీ మూడు జతలు చొప్పున నూతన వస్త్రాలను, నిత్యావసర సరుకులను, చిన్నారులు కప్పుకునేందుకు రగ్గులు, మంకీ క్యాప్‌లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి శివాజీ మాట్లాడుతూ గ్రామ పెద్దలు సమక్షంలో వీటిని అందజేశామన్నారు. స్పెక్ట్ సంస్థ తరపున పిల్లలను విజయనగరంలో ఎక్కడైనా హాస్టల్లో చేర్పించి, ఉచిత విద్యను అందించేందుకు బాధ్యత తీసుకుంటామని గ్రామ పెద్దలకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాతృభూమి సేవా సంస్థ జిల్లా కార్యదర్శి ఇప్పలవలస గోపి, కాళ్ళ రామారావు, గ్రామ సర్పంచ్ సేరెడ్డి చంద్రినాయుడు, ఉప సర్పంచ్ వర్రి శ్రీను, డోల గణపతి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజాం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రాజాం
SOP 7/2025

పిటిషనర్లు :- ఉంగటి హరిత వగైరా
రెస్పాండెంట్లు :- విజయనగరం జిల్లా కలెక్టర్ వగైరాలు

To
విజయనగరం జిల్లా, సంతకవిటి మండలం, హోంజరాం గ్రామ పుర జనులకు పిటిషనర్లు చనిపోయిన లేటు కొర్ను హరిహరి క్రిష్ణం నాయుడుకు ముఖ్య వారసులుగా తీర్మానిస్తూ, వారసత్వపు సర్టిఫికేటు ఇప్పించకోరుచూ పై కోర్టువారి ఎదుట పిటిషను దాఖలు చేసినందున, ఎవ్వరికైనా ఎట్టి ఆక్షేపణలైనా ఉన్న యెడల **తే 22-1-2026దీ**ని ఉదయం పై కోర్టువారి ఎదుట హాజరై మనవి చేసుకోవలెను. అటుల ఎవ్వరూ హాజరు కానియెడల, పిటిషనర్లుకు అవసరమగు ఆర్డర్లు మీ పరోక్షమందు జారీ చేయడమగునని యీ నోటీసు మూలంగా అందరుకు తెలియజేయడమైనది.

Ch. పకీరు నాయుడు
పిటిషనర్లు తరపు న్యాయవాది
రాజాం-532127,
విజయనగరం జిల్లా
సెల్ : 9440522878

రాజాం
తే 11-12-2025ది

దావా నోటీసు
(ఆర్డర్ V రూల్ 1 సి పి సి)
మహారాజశ్రీ బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
O.S. 141/2024

కర్రి మాధవ నాయుడు ......వాది
చిర్ల వరలక్ష్మి వగైరాలు .....ప్రతివాదులు
టు.
(D.2) చిర్ల వినీతా రెడ్డి, తండ్రి లేట్ సాంబ శివారెడ్డి 35-42/A, గౌడువీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా.
(D.4). చిర్ల ఆది లక్ష్మి, భర్త సత్యనారాయణ రెడ్డి 35-42/A, గౌడువీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

పై నెంబర్ దావా **తే.16.12.2025 దీ** ని వాయిదా అయి ఉన్నది . ఆ దినము మీరు శ్రీ కోర్టు వారి యెదుట **ఉదయం 10.30 నిIIలకు** స్వయముగా గాని, మీ అధీకృత ఏజెంట్ ద్వారా గాని హాజరై మీ వాదన దాఖలు చేసుకోగలరు. లేనియెడల మీ పరోక్షమున పై దావా పరిష్కరించబడును.

(శ్రీ కోర్టువారి ఆదేశములతో)

తిరుపతి పాణిగ్రాహి
వాదితరపు న్యాయవాది
బొబ్బిలి